
# అమ్మకచెల్లి

దేవిరెడ్డి వెంకటరెడ్డి



ఉదయం ఆరుకు పులివెందుల బస్సెక్కాను. వెనువెంటనే తిరిగి రావాలని. ఎండంటే పరమ అసహనమేస్తోంది. అక్కడ మహా అంటే అరగంటపని. ఇరవై రెండు వేల చేబదులు నేనుగా మిత్రుడికివ్వాల. అప్పు చేయడానికి ఆలస్యమవుతుంది. తీర్చడానికెంత సమయం పడుతుంది? ఇంతకీ అప్పుచేయడం గొప్పకళ అంటారు గానీ ఈరోజుల్లో డబ్బిచ్చిన వాడికి సరిగ్గా నిద్రపట్టకపోవడం గాక నిరంతరం మన బాగు కోరుకుంటుంటాడు. అది చాలదూ ఈ జన్మకు. పిరికితనంతో ఆత్మహత్యలు చేసుకోవడమెందుకు?

యర్రగుంట్ల ఎప్పుడు దాటి పోయిందో మతికి లేదు. ముద్దనూరు వచ్చేసింది. అది వదిలితే కనుమ. అందులో నాలుగు మలుపులు తిరిగి కిందికి దిగాక మల్లేల. ఇటు నుంచి, అటు నుంచిదాన్ని తల్చుకుంటే చాలు. మనసుకు రెక్కలొచ్చి మావూరి మీద వాలు తుంది. మల్లేల మీదుగా పడమటికి సింహాద్రిపురం రూటుంది. బూసుపల్లె, రాముల కొలను, సుంకేసుల, లావనూరు వగైరా పల్లెలు తగులుతాయి. అందులో సుంకేసుల మా సొంతూరు. ఇద్దరి అక్కగార్నీ ఉండూ ర్లో యిచ్చాం. అదీ ఒక కుటుంబంలోని అన్నకు, తమ్ముడికి. నడిపి బావ శంకర. ముగ్గురు చిన్నాయన పెదనాయన కొడుకు లయినా చాలా ఏళ్ళు ఉమ్మడిగా బతికారు. ఎవరి మహాత్యమోగాని చిన్నక్క పెళ్లయిన నెలన్నరకు విడిపోయారు. పొడుగాటి దంతెలమిద్దె మూడు అరలయింది. భాగాల ప్రకారం మెట్ట భూమి వచ్చింది. ఇంటిల్లిపాది పొలంలో, కల్లంలో శ్రద్ధగా పని చేస్తారు.అక్కగారికి మొదట మగ పిల్లాడు. తర్వాత ఆడపిల్ల. శంకరకు అందుకు విరుద్ధం. నాకు వెంటవెంట ఇద్దరు మగపిల్లలు. లలిత తనకు తానై కుటుంబనియంత్రణ ఆపరేషను చేయించుకుంది.

''ఇకనుంచి నువు కుమార స్వామివి కాదురా కుబే రస్వామివి'' అన్నారు అక్కగారు, లలితను చూడడా నికొచ్చి. అంతటి వాన్ని కాదుగానీ అప్పటికి అమ్మ సమస్య ముదిరి పాకానపడింది. ఈ అత్తాకోడళ్ళు నోరు విప్పితే బూతుబాణాలు మాత్రం వుండవు. లలిత సుదర్శన చక్రం వదిలితే అమ్మ పాశుపతాస్త్రం ప్రయోగిస్తుంది. రూపాయలాభం లేని పెత్తనాల మధ్య సాగే యుద్ధం. అమెరికాకు తెలిస్తే వికటాట్ట హాసం చేస్తుంది. ఇంట్లో ఎక్కువ సేపు వుండక పోయినా దినదినానికి నా పరిస్థితి పోకచెక్కబాపత యింది. ఒకరికి భర్తను. మరొకరికి కొడుకును. చాలా మందిలాగా గత్యంతరం లేక ఒకసారి భార్యవైపు మొగ్గు చూపాను. అదీ శ్రుతిమించినపుడు. అమ్మ మొగం చిన్నబోయింది. గొంతులోంచి మారుపలుక లేదు. ఎంతమథనపడిందో ఏమో అదే రోజు చెప్ప కుండా సుంకేసుల చేరింది. అది రెండందాలా మంచిదే అనుకున్నాను.

''ఒరేయ్ స్వామీ! అల్లుళ్ళను అడుక్కునే దుస్థితికి తీసుకురాకు. ప్రతినెలా డబ్బులు పంపకపోతివా ఇక్కడే ఉరేసుకుని చస్తా'' అంది అమ్మ.

ఉసిపాటు వుండి చెడ్డపేరు తెచ్చుకోవడ మెందుకని డబ్బులు దారాళంగా యిస్తు న్నాను. ముందుకు ముందుగా ఒక మొత్తాన్ని పెట్టకపోలేదు. అయినా రానురాను అక్కల ముచ్చట్లు ఎక్కువయ్యాయి. ఒకరికే భారం కాకుండా అమ్మ ప్రతి ఏడాదికీ మారుతూ వస్తోంది. ఆమె ఎవరింట్లో తిన్నా మంచం తీసుకుని ఒళ్ళు పెంచుకునే రకం కాదు. పైరు కాలంలో పొద్దున, సాయంత్రం పొలం మీది కెళ్ళికావిలి వుంటుంది. పైరొడిపాక కల్లం వద లదు. ఎండాకాలంలో పొయిలోకి ఓ మోపు ఎండుపుల్లలు తెస్తుంది. అట్లే రెండుగంపల పేడకుప్పేస్తుంది. ఎన్ని చేసినా అక్కగారి అసంతృప్తి తెరలు తెరలుగా లేస్తోంది. దీనికి మూలాలు నా స్టేట్‌బ్యాంకి ఉద్యోగం, పెట్టు పోతలు చూపని లలిత.

''అత్తకోడళ్ళకు సరిపోదని మీకు తెలీదా? చిన్న తగాదా వచ్చినా అత్త నేరుగా ఇక్కడ దిగుతుంది. మీరూ వద్దంటే ఆమె ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల. దానివల్ల ఎవరికి మనస్తాపం? తమ్ముడి పరిస్థితి గురించి బాగ ఆలోచించండి.''


''అమ్మను సాకాల్సిన బాధ్యత ఎవరిదిరా? చిన్న చిన్న సేవలు చేయలేని రోగిష్టిదా నీపెళ్ళాం?'' కలిసి కట్టుగా దాడి చేశారు. నీ వెంటంబడి బస్సెక్కిస్తామ న్నారు. అది జరక్కూడదని నా చింత.

''అత్తకోడళ్ళకు సరిపోదని మీకు తెలీదా? చిన్న తగాదా వచ్చినా అత్త నేరుగా ఇక్కడ దిగుతుంది. మీరూ వద్దంటే ఆమె ఏ నుయ్యో గొయ్యో చూసుకో వాల. దానివల్ల ఎవరికి మనస్తాపం? తమ్ముడి పరి స్థితి గురించి బాగ ఆలోచించండి.'' శంకర గట్టిగా జోక్యం చేసుకున్నా అతని మాటకు మాట ఎదురి చ్చారు. వాళ్ళ ఆంతర్యం పసిగట్టాను. అమ్మను ఇంత వరకు సాకినదానికి, ఇకపై సాకేదానికి మాకేమిస్తావు? సాగదీస్తే సూటిగా అడుగుతారు. చెరి ఎనిమిదేళ్ళపై బడి సాకారు. గుండు మొత్తంగా తమకంటూ ఎంతో చెందలేదు.

''తెలిసి ఇరున పెట్టడం న్యాయం కాదక్కా. నెల వారియిచ్చేదిగాక చెరో ఇరవైవేలు తొందర్లో తెచ్చి స్తాను. అమ్మకూ మీకళ్ళముందుండడం ఇష్టం. ఏమంటారు?'' ఉభయులకు తృప్తి, ప్రశాంతత వుండాలని ఉదారంగా పోయాను. ఐనా ఒప్పుకో లేదు. మంతనాలు జరిపి పాతిక చేశాడు శంకర. అందులో ఏకపక్షమేం లేదు.

''బంగారం దిగేసుకోడానికి అడగలేదురా. అప్పు లోళ్ళ వాతకొట్టడానికి'' అన్నారు మూతులు బిగించి. అమ్మ ఎక్కడో వుంటుంది. ఈ సందుకు రాదు. నా మీద ఏదో గుర్రు. మొత్తం మీద అందరికి అలుసైపో యాను. అంగీకరించక తప్పలేదు. అక్కగారి డబ్బు సంగతి లలిత మూడ్ బాగున్నప్పుడు చెప్పాను.

''ఆడపడచులకు అంతా ఆడపిల్లలనా? ప్లస్సూ, మైనస్సూ. ఇక తగిలేదేముంది? అమ్మను సాకాల్సిన బాధ్యత కొడుకుదే అని ఎక్కడుందంట'' అనివాదన పెట్టుకుంది. తన కొడుకుల మాదిరి మేనల్లుళ్ళు ఇంజ నీరింగులో చేరారా? బండ్లకు కట్నమొస్తుందనుకోడా నికి. సాకడంలోని సాదక బాధకాలను చెప్పుకుంటూ ఒప్పించడానికి నెలదాకా పట్టింది. మాటనిలుపుకో వాలని మరుదినం సుంకేసుల్లో దిగాను. అక్కగారి మొగాలు వికసించాయి. శంకర సమక్షంలో అతని చేతుల మీదుగా డబ్బు కట్టలు అందించాను. వానా కాలమని మోసుకొచ్చిన గొడుగును ఎక్కడా తెరి చింది లేదు. మరుసటి వారంలో విత్తనం వాన పడ టంతో పాటు ఉట్టిపాటుగా అమ్మ కన్నుమూసింది. మంచానా కుంచానా పడనందుకు మీ అమ్మది పుణ్య మైన చావన్నారు వూరి జనం. బూడ్పు ఏర్పాట్లు శంకర మాట్లాడి పెట్టాడు. మేం మోడికాళ్ళం. బావ గారు తిర్నాందార్లు. మా శవాన్ని వారు మోయకూ డదు. అది ఈ మోరు గనుక. అశుభమని ముసలీ ముతకా చెప్తుంటే శంకర వింటేనా? నా వెనకకోపు పట్టాడు. తెల్లారి మెతుకువేయాలి. రాత్రికి ముగ్గురి ళ్లల్లో నిద్ర చేయకూడదు. దాన్నీ అవలీలగా వ్యతిరే కించి తనింట్లో పడక ఏర్పాటు చేశాడు. ఇందులో ఏదీ కీడుపనికాదు. అట్లనుకున్నప్పుడు ఏదీ తప్పని పించదు. చావు ఆచారాల్ని తేలికగా తీసుకున్నాడంటే మొరటుదనమా లేక తాను పరాయివాడనను మనో భావమా? జవాబు కోసం పెద్దగా ఆరాటపడలేదు. భోంచేశాక అమ్మచర్చ గంటకు మించి జరిగింది. పొద్దున కాకి కార్యం పూర్తి చేసి నా దోవ నేను పట్టాను. అది సుత, సుంకేసలకు రాకపోకలు నిలిచి పోయాయి.



"పెళ్ళికి ఇద్దరు తప్పక రావాలన్నా". అరుమాసాల తర్వాత శంకర సతీసమేతంగా వచ్చి పెళ్ళిపత్రిక యిచ్చాడు. లలిత నిముషాల్లో కాఫీ చేసింది. మాటల్లో రాముల కొలను సంబంధం గురించి కట్నం, పెళ్ళికొడుకు చేస్తున్నపని, ఆస్తి, బంధుత్వం వివరాలు దొర్లాయి.

"శుభకార్యం నెరవేర్చడానికి తండ్రిగా పడరాని అగచాట్లుపడుతున్నాను. ఖర్చు మిగులుతుందని నిశ్చితార్థం జరపలేదు. దానికి పెళ్ళి నెత్తినపడింది. వీలుంటే పదో పదైదో సర్దు స్వామీ" కప్పు టీపాయి మీద పెట్టి అడిగాడు శంకర.

"మిగిలింది మిగిలినట్లు కొడుకులు వూడ్చుకుపోతున్నారన్నా" తటాలున బదులిచ్చింది లలిత. అంతే శంకర దీనముఖంతో లేచి ఆఖరి పలుకుకు పాలిపోయిన చిరునవ్వును తెచ్చిపెట్టుకుని వస్తాం అన్నాడు. తాపలు దిగి మొగాలు దిగేసుకుని పోతుంటే నా ఒళ్ళు ఆపాదమస్తకం జలదరించింది. వీధి మలుపు తిరిగారో లేదో "సర్దు అంటే అర్థమేమిటండీ? సాయమనా?" అంటూ నిలదీసింది లలిత. మన ఆడపడచులకు చేసిన విధంగానా? అని ఆమె వూహ. ఎట్ల తిప్పినా తనకు శంకర దగ్గర వాడు కాదు. అందుకు నన్ను మూగవాన్ని చేయడం.

"సర్దమంటే సాయం కాదు. అప్పుగా యిమ్మని". మూతి మింద కొట్టి చరచరా లోపలికొచ్చాను. విత్తనం కాయలకని, ఎరువులకని, తెగుళ్ళ మందులకని, ఆస్పత్రికని డబ్బులు అడిగినవాడు కాదు. ఆడపిల్ల పెళ్ళికి అడగాలనుకున్నాడు. అడిగాడు. వ్యవసాయంలో మిగులుబాటు వచ్చిందా రుణం వుంచుకోడు అయినా పల్లెటూరి భాషలో కొంపలు ముంచేంత మెలికలుంటాయా? పెళ్లిళ్ళు సీజను పూర్తయ్యాక శంకర కూతురు పెళ్ళికి ఎగ్గొట్టడం తప్పని లలిత ఒప్పుకుంది. ఆత్మవిమర్శంటే ఇదా? భార్య తత్వంలో గుడ్డిలో మెల్లను సుగుణం వున్నందుకు పులివెందుల పొలిమేరల్లో నవ్వుకున్నాను.

పాత బస్టాండులో దిగి వెనక్కి ఐదారు బారలు నడిచే లోపల పెదబావ అగుపడ్డాడు. మెడికల్‌షాపు మోట్లో ఎవరో రైతుతో మాట్లాడుతున్నాడు. క్షణాల్లో సిగ్గుకమ్ముకుంది. మీ అమ్మపోతానే మమ్మల్ని మరిచిపోయావా? అని అడిగినా అడగచ్చు. ముక్కుసూటి మనిషి. చేతిలో కట్టెల బ్యాగుంది. బేస్తవారం సంతదినమని గుర్తొచ్చింది. తడబాటుతో పలకరించాను.

"ఎందుకట్లా చేశావోయ్?" ఇందాకున్న వ్యక్తి వీపు మళ్ళించాక కాస్త కరకుగా గొంతిప్పాడు బావ. దేన్ని గురించి ప్రశ్నించాడో అరటి పండొలుచుకున్నంత సులువగా తెలిసిపోయింది.

"కాఫీ తాగుదాం పదబావా చెప్తాను" అంటూ కింది బజారులోకి నడిచాను. జివ్వి చెట్టుకింద తెలిసిన హోటలుంది. గంటసేపు కూర్చున్నా అభ్యంతరం వుండదు. ఎటూ సెలవుపెట్టాను.

"ఏమైనా తింటావా బావా?" వాణీ విలాస్‌లో ఎదురెదురుగా గోడవారకు జరిగాం. మంది పల్చగ వున్నారు. ఓనరు మమ్మల్ని చూసి బెల్లుకొట్టాడు.

"ఏమీ వద్దు. వచ్చేటప్పుడు సద్దన్నం తిన్నాను. కాఫీ చాలు" నిర్మొగమాటంగా చెప్పాడు. సుంకేసులకు పోక మూడేళ్ళు పైబడింది. కలిసి పదో ఒకటి తినాలనిపించింది. దోశలకు ఆర్డరిచ్చాను.

"మీరు శంకర కూతురు పెళ్లికి ఎందుకు రాలేదని మనవాళ్ళంతా అనుకున్నారు. అప్పుడు వూర్లో లేరా?" సౌమ్యంగా బావ మొదటికొచ్చాడు. డబ్బుతో ముడిపడిన సున్నిత విషయమది. కెలికితే ఎంతదూరమైనా పోగలదు.

"శంకర డబ్బు సర్దమన్నాడు. నేను ఆ పని చేయలేకపోయాను. అందుకు పెళ్ళికి రాలేదు బావా" సొట్టకారణాల్లోకి దిగడం అయిష్టమై జరిగింది చెప్పాను.

"విధిలేకా, దిక్కుతెలీని అవస్థలో అడిగాడు. నువ్వు కనీసం మొగం చూపించి పోయుండినా వాడు సంతోషపడేవాడు. ఆరాతీసేవాళ్ళ నోళ్ళు మూతలు పడేవి" ఇదే తన అభిప్రాయమన్నట్లు చూశాడు.

"పెళ్ళికి రాకపోవడం మాది తప్పుకాదనను. అంత మాత్రాన శత్రువులవుతామా?" ప్లేటు దగ్గరకు జరుపుకున్నాను. ఇక ఎక్కువ మాటలు అనవసరమనిపించింది. చింతాకంతయినా మంచి లేని ఘటనను ఎందుకు తవ్వుకోవాలి? లలితను దోషిగా చేయడం మరీ అనాగరికం. సహజత్వం ఆమెకు అంత త్వరగా వంటబట్టదు. ఏం చేస్తాం? బావ దోశ తిని గమ్మున కూర్చున్నాడు. జీవితం మళ్ళీ మళ్ళీ చదవాల్సిన పుస్తకం. అందులో ఏదో అధ్యాయాన్ని అవలోకనం చేసుకుంటున్నాడా? అనిపించింది.

"ఆదాయమా? దాన్ని కళ్ళ చూడక ఇప్పటికి తొమ్మిదేళ్ళవుతోంది. మీ అమ్మ లేని లోటు మాకు పెద్ద దెబ్బ. ఆమె ఎవరింట్లో తిన్నా నీ డబ్బును అక్కా చెల్లెళ్ళుసమంగా పంచుకున్నారు. నిస్వార్థంగా చెప్పాలంటే శంకర, వాడి భార్య పిలిచిపిలిచి మీ అమ్మకు బువ్వ పెట్టారు. నాకు తెలిసి మొదటి నుంచి ముగ్గురిండ్లల్లో సమానంగా తినింది. చేతనైన పనులు చేసింది కూడా. శంకర రైతు గుణంతో మీ అమ్మను ఆదరించాడే తప్ప సాయం కోరడానికి కాదు. ఒక్క రైతుకు అప్పు ఇవ్వడం కూడా సాయమే నోయ్"

"శంకర ఎట్లున్నాడు? అడిగినట్లు చెప్పుబావా". ముక్తాయింపుకొచ్చాను. ఇంతలో సర్వరు కాఫీలు తెచ్చి బిల్లు వేశాడు.

"పల్లెటూరి వాళ్ళ బాగు ఏం బాగు లేవోయ్. మన సీమవనాలు పిచ్చోడి చేతిలోని రాళ్ళతో సమానం. ఏ పంటకూ గిట్టుబాటు ధర వుండదు. వ్యవసాయంలో అంతా దోపిడీ. అందరిలాగా శంకరా అప్పుల్లో మునిగాడు. దానికి తోడు మీ అమ్మ చావు నిందను చాలా కాలం మోశాడు" అన్నాడు కప్పుతీసుకుంటూ.

"చావు నిందేమిటి?" ఆత్రంతో అడిగాను.

"మీ అమ్మ చనిపోడానికి రెండ్రోజుల ముందు శంకరయింట్లో సంగటి తినింది. గోడనీడలో పంచరగుమీద బారాకట్టె ఆడి కుండ కడగడానికి లోపలికి పోయింది. చుట్ట కుదురుమీదుగా తేలు అప్పటికే పాకినట్లుంది. కుండతో వాకిలిదాటే లోపల దానిపని అది చేసింది. వెంటనే శంకర నాటు మందు వేయించి ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. సాయంత్రానికి మామూలు మనిషయింది. చనిపోయినా రోజు మీ అక్కగారి మధ్య తేలుకాటు తిరగబెట్టిందని గుసగుసలు పుట్టాయి. తర్వాత అవి బలిసి ముఖాముఖి అయ్యాయి. మీరు అన్నం పెట్టారు. మాయమ్మ పోయింది. లేకపోతే మరో పదేళ్ళు బతికేదని వాపోవడాలు, ఆడిపోసుకోడాలు మానలేదు. మేంనోరు చేసుకున్నా ఎవరూ వదల్లేదు. అందుకు మూల కారణం మీ అమ్మ ద్వారా నెలనెలా వచ్చే నగదు పంట ఎండిపోవడం. శంకర ఎప్పుడూ ఎవరినీ పళ్ళెత్తు మాట అనలేదు. లేమిడిని అర్థం చేసుకున్నాడు. మగవాళ్ళ మధ్య ఒద్దిక లుండబట్టి సరిపోయింది. అవి తగ్గింటే మెడపట్లేగతి" అన్నాడు జీరవోయిన గొంతుతో బావ. ఆనాడు శంకర నాకు తేలు సంగతి చెప్పకపోలేదు. టౌను ఆస్పత్రిలో చూపించినందుకు మెచ్చుకున్నాను.

"ఏం ఆడవాళ్ళుబావా?" సిగరెట్టు బయటికి తీశాను.

"కరువు రక్కసికి వాళ్ళేం ముద్దా? దరిద్రానికి నానాక చింతలంటుంటారు గదా! అందులో ఇదీ ఓ చింతకావచ్చా" పేలవంగా నవ్వాడు బావ.

"ఈ నాలుగేళ్ళుగా భూముల్లో బొత్తిగా ఆదాయమే లేదా?" అగ్గిపుల్ల గీకి సిగరెట్టు అంటించుకున్నాను.

"ఆదాయమా? దాన్ని కళ్ళ చూడక ఇప్పటికి తొమ్మిదేళ్ళవుతోంది. మీ అమ్మ లేని లోటు మాకు పెద్ద దెబ్బ. ఆమె ఎవరింట్లో తిన్నా నీ డబ్బును అక్కా చెల్లెళ్ళుసమంగా పంచుకున్నారు. నిస్వార్థంగా చెప్పాలంటే శంకర, వాడి భార్య పిలిచిపిలిచి మీ అమ్మకు బువ్వ పెట్టారు. నాకు తెలిసి మొదటి నుంచి ముగ్గురిండ్లల్లో సమానంగా తినింది. చేతనైన పనులు చేసింది కూడా. శంకర రైతు గుణంతో మీ అమ్మను ఆదరించాడే తప్ప సాయం కోరడానికి కాదు. ఒక్క రైతుకు అప్పు ఇవ్వడం కూడా సాయమే నోయ్" విషాదం పొంగుతో బావ ముఖం గంభీరమయింది. రైతు సమీక్ష విని చలించిపోయాను. సిగరెట్టు ఎంతకాలిందో ఏమో వేళ్ళ నుంచి జారిపోయింది. ఔరా అక్కగారూ, అమ్మగారూ అనుకున్నాను. గానీ నాలోని అమ్మక చెల్లను శంకర విధ్వంసం చేశాడు.. మానవీయతకు అమృతం పోశాడు. పుణ్యకాలం మించి పోరాదని బస్టాండు వేపు అడుగులు పడుతున్నాయి. చేబదులు తీర్చకపోతే ఉద్యోగమేం వూడిపోదు. మనసు లోని సంగతి బావకు చెప్పాను.

"నేను కనబడినందుకు తిట్టుకుంటున్నావా?" బావ ప్రశ్నకు, నవ్వుకు నొచ్చుకోలేదు.

"తప్పించుకోవాలను ఉద్దేశ్యం వుంటే అటు వెళ్ళేవాడిని బావా. అయినా నేనేం దానం చేయడం లేదు" అన్నాను మనస్ఫూర్తిగా. పూల అంగళ్ళు సమీపించాం. హారనుశబ్దాలు వినిపిస్తున్నాయి. దగ్గరకొస్తే గాని ఏవూరి బస్సో తెలీదు.

"వస్తా బావా" అన్నాను బోర్డు చూసి.

"మళ్ళీ ట్రిప్పుకొస్తే నాటు కోడికోస్తా, రాత్రికి వుండోయ్"అన్నాడు బావ తన నైజం కొద్ది. ఎటూ వుండక తప్పదని బిరబిరా వెళ్లి సుంకేసుల బస్సు కరుచుకున్నాను.

★